పేదలకు కార్పొరేట్ వైద్యం ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి రూరల్: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాయని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యల్ని నిర్లక్ష్యం చేసి ఎంతో మంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకునే ఆరోగ్య సురక్ష సేవల్ని ముఖ్యమంత్రి ప్రారంభించారని పేర్కొన్నారు. పేదల చెంతకే వైద్య సేవలు, అధునాతన వైద్య పరీక్షల్ని తీసుకువచ్చి వారి ఆరోగ్య భరోసా కల్పించే దిశగా ఆరోగ్య సురక్ష సేవలు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. అందరికీ ఆరోగ్యం అన్నది కేవలం నినాదంగా ఉండిపోకుండా, దాన్ని నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ కుంభం బాలాజీ, ఎంపీటీసీ సభ్యురాలు కాజా భద్రావతి, పార్టీ నేతలు ఉన్నారు.

జగనన్న సురక్షతో ప్రజారోగ్యానికి రక్ష

వల్లభాపురం(కొల్లిపర): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తుందని తెనాలి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలకులు యర్రం వెంకటేశ్వరరెడ్డి , తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. మండలంలోని వల్లభాపురం గ్రామ సచివాలయం- 2 పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శివకుమార్, తెనాలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పార్టీ పరిశీలకులు యర్రం వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



శిబిరానికి వచ్చిన ప్రజల నుంచి వైద్య సేవల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శివకుమార్

శిబిరంలో వైద్య పరీక్షల నిర్వహణ, మందులు నాణ్యతతో పాటు శిబిరానికి వచ్చిన రోగుల ఆరోగ్య పరిస్థితులు గురించి అడిగితెలుసుకున్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల ఆరోగ్య సురక్షణే ధ్యేయంగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మారుమూల పల్లెల ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందజేస్తున్నారని తెలిపారు.

తెనాలి ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శిబిరంలో ఆరోగ్య పంరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, డాక్టర్ ప్రియాంక , డాక్టర్ దిలీప్ , స్పెషలిస్ట్ డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ షేక్ కరిముల్లా 531 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 180మందికి రక్త, 50 మందికి ఈసీజీ, మిగిలిన వారికి కంటి, బీపీ షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు, 40 మందిని మాత్రం మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి, కార్పొర్పొరేట్ హాస్పిటల్‌కి రిఫర్ చేశారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలికులు యర్రం వెంకటేశ్వరరెడ్డి సర్పంచ్ వల్లభాపురం నిర్మల, తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ అవుతు సీత, పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, ఎంపీడీవో వి.విజయలక్ష్మి , తహసీల్దార్ నాంచారయ్య, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



వల్లభాపురంలో సచివాలయం- 2లో రోగులను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ



మాట్లాడుతున్న, తెనాలి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పార్టీ పరిశీలకులు యర్రం వెంకటేశ్వరరెడ్డి

రాష్ట్రంలో ఆరోగ్య విప్లవం తెచ్చిన సీఎం

తెనాలి అర్బన్: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహనరెడ్డి రాష్ట్రంలో ఆరోగ్య విప్లవాన్ని తీసుకువచ్చారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి, ఆరోగ్యానికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, కమిషనర్ ఎం. జశ్వంతరావు మాట్లాడుతూ జనరల్ ఓపీ 170, సర్జన్ ఓపీ 93, ఫిజీషియన్ ఓపీ 95, అష్టమాలజీ ఓపీ కింద 160 మంది పరీక్షలు చేయించుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోగిరెడ్డి మానసరెడ్డి, మట్లపూడి సంధ్యారాణి, మొగల్ అహ్మద్ బేగ్, కొమ్మరబత్తుని జయపాల్, పేరం సంజీవరెడ్డి, యాతాటి అనిల్, దుబాయ్‌బాబు, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, జగనన్న ఆరోగ్య సురక్ష స్పెషల్ ఆఫీసర్ కలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, మట్లపూడి నాగేశ్వరరావు, ఈద్గా గౌస్ పాల్గొన్నారు.



చెంచుపేటలోని జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌కు వచ్చిన ప్రజలు



చెంచుపేట శిబిరంలో బీపీ పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు

పొలంబడితో రైతులకు పలు ప్రయోజనాలు



తెనాలి టౌన్: పొలంబడితో రైతులకు పలు ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ తెలిపారు. రూరల్ మండలం మల్లెపాడులో బుధవారం వ్యవసాయాధికారులు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి సాధించడానికి పొలంబడి ఉపయోగపడుతుందని తెలిపారు. పైరు శత్రు, మిత్ర పురుగుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. పొలంబడి వల్ల కలిగే ప్రయోజనాల్ని తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

తెనాలి రూరల్: పట్టణంలోని పాండురంగపేట మహాప్రస్థానం ఎదురుగా ఉన్న పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. బుధవారం సాయంత్రం మహాప్రస్థానానికి మృతదేహాన్ని తీసుకువస్తున్న వారు టపాసులు పేల్చడంతో నిప్పురవ్వలు ఇంటి మీద పడి పైకప్పు దగ్ధమైంది. ప్రమాదంలో గృహ సామగ్రి కాలిపోయిందని బాధితుడు షేక్ సుభాని వాపోయారు. ప్రమాద విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. రూ. 70 వేల నష్టం ఉంటుందని భావిస్తున్నారు.

ఇజ్రాయిల్ కోసం ప్రత్యేక ప్రార్థనలు

మంగళగిరి: ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య ఏర్పడిన యుద్ధ వాతావరణం వెంటనే సమసిపోయి శాంతి ఏర్పడాలని మెట్రో రీజయన్ ఫెల్లోషిప్ ఆర్గనైజింగ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని పార్కు రోడ్డులోని ఇమ్మానుయేలు చర్చిలో జరిగిన ప్రార్థనలలో పాస్టర్లు బి.రవిప్రకాష్, పిల్లి దయారత్నకుమార్, దున్నా నాగయ్య, బేతాళ సాల్మాన్ రాజు, నండూరి బాలస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిర్మల ఫార్మసీ కళాశాలకు ప్రభుత్వ ప్రశంసలు



మంగళగిరి: నగరపాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలకు ప్రభుత్వ ప్రశంసలు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రహమాన్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్‌తో పాటు ఫార్మసీ విభాగంలో ఆల్ ఇండియా ఎన్ఐఆర్ఎఫ్ 88వ ర్యాంకు ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ డాక్టర్ యు శౌరీ అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ నిర్మలజ్యోతి, ప్రొఫెసర్లు అభినందించారు.

దొంగల దాడిలో గాయపడిన వృద్ధురాలికి డీఎస్పీ పరామర్శ



మేడికొండూరు: మండల పరిధిలోని భీమినేనివారి గ్రామంలో మంగళవారం దొంగల దాడిలో గాయపడిన వృద్ధురాలిని తుళ్లూరు డీఎస్పీ పోతురాజు బుధవారం పరామర్శించారు. చోరీ జరిగిన తీరును ఆమెను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి కేసును త్వరితగతిన ఛేదిస్తామని తెలిపారు. గ్రామాల్లో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వెంటనే 100 నంబరుకు సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట మేడికొండూరు సీఐ వాసు ఉన్నారు.

దివ్యాంగుడికి క్రికెటర్ అంబటి రాయుడు చేయూత



మేడికొండూరు: దివ్యాంగుడికి క్రికెటర్ అంబటి రాయుడు చేయూత అందించారు. మేడికొండూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు తూమాటి డేవిడ్ మూడు చక్రాల వాహనాన్ని అందించాలని పర్యటనకు వచ్చిన అంబటి రాయుడికి విన్నవించారు. స్పందించిన ఆయన సొంత నిధులతో మూడు చక్రాల వాహనాన్ని అందించాడు. బుధవారం అనుచరులతో కలసి మూడు చక్రాల వాహనాన్ని డేవిడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజి, సొసైటీ చైర్మన్ జయరావు, గాలీబ్, ఉడతా ప్రభాకర్, రాజేంద్రప్రసాద్, సుబ్బారెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

కేవైసీ అప్‌డేట్ పేరిట మోసం

పట్నంబజారు: కేవైసీ అప్‌డేట్ పేరిట బురిడీ కొట్టించి ఖాతా నుంచి అక్రమంగా నగదు డ్రా చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సంపత్‌నగర్‌కు చెందిన షేక్ ఆలిహుస్సేన్‌కు యాక్సెస్ బ్యాంకులో రెండు అకౌంట్లు ఉన్నాయి. ఈనెల 5న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను బ్యాంకు మేనేజర్‌నని, కేవైసీకి సంబంధించి అప్‌డేట్ చేయాలని నమ్మబలికే ప్రయత్నం చేశాడు. దీంతో అలి హుస్సేన్ తాను బ్యాంకుకు వచ్చి అప్‌డేట్ చేయించుకుంటానని చెప్పిన క్రమంలో ఫోన్ పెట్టేసిన తరువాత కొద్దిసేపటి తరువాత అదే వ్యక్తి ఫోన్ చేసి అకౌంట్ హ్యాక్‌కు గురైందంటూ నమ్మబలికాడు. ఓటీపీ చెప్పకపోతే నగదు పోతుందని భయపెట్టాడు. దీంతో సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పగా, అంకౌంట్‌లోని రూ. 3 లక్షలు నగదు విత్‌డ్రా అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సాయిబాబానగర్‌లోని ఓ వృద్ధాశ్రమంలో ఉండే బి.శ్రీనివాస్ (62) మంగళవారం కళ్లు తిరిగి కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. నిర్వాహకులు జీజీహెచ్‌కు తరలించారు. శ్రీనివాస్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ బెట్టింగులపై కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

కొల్లూరు: జూద క్రీడలపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో వెనకాడబోయేది లేదని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. బుధవారం కొల్లూరు పోలీసు స్టేషన్ వార్షిక తనిఖీలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో పోలీసు సిబ్బంది మొత్తం క్రికెట్ బెట్టింగ్‌లు అరికట్టే విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అక్రమ మద్యం విషయంలో సమన్వయంగా పని చేస్తూ ఎటువంటి అమ్మకాలు జరగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కొల్లూరు పోలీసు స్టేషన్ రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాల గురించి వేమూరు సీఐ వెంకటేశ్వరరావు, కొల్లూరు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో వెంటనే సిబ్బంది అప్రమత్తమై క్షతగాత్రులను కాపాడటంతో పాటు, తిరిగి చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తొలుత కొల్లూరు పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేసుల విషయంలో అశ్రద్ధ వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచనలు జారీ చేశారు. రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ పాల్గొన్నారు.



కొల్లూరు పీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

విద్యార్థినుల చిత్రలేఖనం పోటీలకు స్పందన

భట్టిప్రోలు: అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూలులో విద్యార్థినులకు సహృదయ సేవా సంఘం(గుంటూరు) వారి సహకారంతో చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో సయ్యద్ షబీనా (9వ తరగతి), తైదుల సుమ (10వ తరగతి), షేక్ సాత్విక (6వ తరగతి), ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. మొదటి ఐదుగురు విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. మరో 15 మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం చందలూరి రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి.మల్లికార్జునరావు, సేవా సంఘం అధ్యక్షుడు సుద్దపల్లి బాబ్జీ, కో–ఆర్డినేటర్ భూపతి సునీత, పి.వెంకటరత్నం పాల్గొన్నారు. చిత్రలేఖన పోటీలను ఉపాధ్యాయులు సత్యరత్న, పల్లవి, థెరిస్సా పర్యవేక్షించారు.



పోటీలలో పాల్గొన్న విద్యార్థులతో సహృదయ సేవా సంఘం నిర్వాహకులు

తైక్వాండోలో విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత నెల 28న బీఆర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో పోటీల్లో భాగంగా అండర్–14 సబ్ జూనియర్ విభాగంలో 8వ తరగతి విద్యార్థిని బి. హర్షవర్ధని, అండర్–11 సబ్ జూనియర్ విభాగంలో బి. రమ్యశ్రీ 90 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి, స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, పీఈటీ రావిపాటి చంద్రమోహన్ పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి, ప్రసాదరావు

ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రొఫెసర్లకు అరుదైన గుర్తింపు

మంగళగిరి: గుంటూరు జిల్లా నీరుకొండ గ్రామంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన ఐదుగురు ప్రొఫెసర్లకు అరుదైన గుర్తింపు లభించింది. ఉత్తమ శాస్త్రవేత్తలుగా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్లు కార్తీక్ రాజేంద్రన్, రంగభాష్యం సెల్లసెంబియన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్లు రణధీర్‌కుమార్, క్షీరసాగర్ సాహు, దివ్యా చతుర్వేది ప్రపంచ వ్యాప్తంగా టాప్ టూ ర్యాంకింగ్ జాబితాలో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఇటీవల జరిపిన శాస్త్రవేత్త డేటా విశ్లేషణ ప్రక్రియ ద్వారా ఉత్తమ శాస్త్రవేత్తల ర్యాంకులను ప్రకటించారు. ఎనర్జీ, నెట్ వర్కింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ ఇమేజ్ ప్రాసెసింగ్, ఎన్విరాన్‌మెంట్ సైన్సెస్ విభాగాల్లో అత్యుత్తమ పనితీరును కనబరచిన ఐదుగురు శాస్త్రవేత్తలను యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణతో పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.



గుర్తింపు పొందిన ప్రొఫెసర్లు

విశ్రాంత ఉపాధ్యాయురాలు సునందమ్మ మృతి



తెనాలి టౌన్: మండలంలోని కొలకలూరులో విశ్రాంత ఉపాధ్యాయురాలు కోడూరు సునందమ్మ(నాగమ్మ) (86) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మనుమరాలు చొప్పర ప్రీతి కొకలలూరు సర్పంచిగా పని చేస్తున్నారు. కుమారుడు కోడూరు సుదర్శన్‌బాబు విజయవాడలో ట్రాన్స్‌కోలో డీఈఈగా పని చేస్తున్నారు. సునందమ్మ భౌతికకాయాన్ని పలువురు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, న్యాయవాదులు, ఉద్యోగులు సందర్శించి నివాళులర్పించారు.

భిన్న వాతావరణంతో ఉక్కిరిబిక్కిరి



భట్టిప్రోలు: ఉదయం మంచు ఆపై వర్షం.. మధ్యాహ్నం నుంచి భానుడు భగభగ మండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత నాలుగు రోజులుగా ఉదయం పూట మంచు, ఆ తరువాత ఎండతో పాటు ఉక్కపోత పోస్తోంది. భిన్న వాతావరణం ప్రభావంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. బుధవారం ఉదయం భట్టిప్రోలులో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఏకధాటిగా గంట సేపు వర్షం కురిసింది. ఈ వర్షం మండలంలో కొన్ని ప్రాంతాల్లో లేకపోవడం గమనార్హం. ఈ వర్షం పంట పొలాలకు జీవం పోస్తుందని రైతులు తెలిపారు.

ఇంట్లో చోరీ

పట్నంబజారు: ఇంట్లో చోరీపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జియావుద్దీన్‌నగర్‌లో నివసించే రాయ స్వాతి కుటుంబ సభ్యులు ఈనెల 10న రాత్రి తలుపు తీసి ఇంట్లో నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తులు లోపలకు ప్రవేశించి 16 గ్రాముల బంగారం, రూ. 20వేలు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలే లక్ష్యం : డీఈవో

తెనాలి టౌన్: పది తరగతి పబ్లిక్ పరీక్షల్లో గత ఏడాది కన్నా మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి శైలజ తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. విద్యార్థులు తరగతి గదులు, పరిసరాలు, అక్షయపాత్ర ద్వారా వచ్చిన మధ్యాహ్న భోజనం, వాటర్ ప్లాంట్లను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ ఎంతవరకు పూర్తి అయ్యింది ? అని అడిగి తెలుసుకున్నారు. రాబోయే పరీక్షలకు సిద్ధపడాలని తెలిపారు. గత ఏడాది 10వ తరగతిలో వచ్చిన ఫలితాల గురించి ఉపాధ్యాయుల్ని అడిగారు. ఇప్పటి వరకు పూర్తి అయిన సిలబస్‌లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలించారు. ఎస్.ఏ–2 సాంఘిక శాస్త్రం పరీక్ష పత్రాన్ని తనిఖీ చేశారు. 7వ తరగతిలో సాంఘిక శాస్త్రం నోట్‌బుక్స్‌ను పరిశీలించి ఉపాధ్యాయుడు అన్నారావును డీఈవో అభినందించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాల్ని అందజేశారు. ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులతో ఫోటోలు దిగారు. కార్యక్రమంలో ఎంఈవో జయంత్‌బాబు, హెచ్ఎం మాచర్ల నాగేశ్వరరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంసా పత్రాన్ని అందజేస్తున్న డీఈవో శైలజ

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి

తాడేపల్లిరూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం బాగుంటుందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శారదాదేవి అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ఆహా క్యాంటీన్‌ను బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు జీరో వడ్డీతో పాటు వివిధ రకాల రుణాలు అందజేస్తోందని చెప్పారు. ఇప్పుడు సరికొత్తగా అతి తక్కువ ధరలో పౌష్టిహాహారాన్ని అందించేందుకు డ్వాక్రా మహిళలను ప్రోత్సహిస్తూ ఆహా క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లిలో డోలాస్‌నగర్ చంద్రిక గ్రూప్‌నకు చెందిన సభ్యులు మాగంటి సౌజన్య, కె.వరకుమారి ఈ క్యాంటీన్‌ను మొట్టమొదటగా ప్రారంభించారని తెలిపారు. ప్రభుత్వం స్థలం కేటాయించడంతో పాటు అవసరమైన టెంట్‌ను ఏర్పాటు చేసుకోవడానికి రూ.13 వేల ఆర్థిక సహాయాన్ని అందించి నెలకు రూ.500 చెల్లించే విధంగా రుణ అందజేస్తోందని చెప్పారు. ఈ ఆహా క్యాంటీన్ వల్ల డ్వాక్రా మహిళలు స్వయంగా పోషక విలువలతో కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తారని, ధర కూడా తక్కువగా ఉంటుందని వివరించారు. మెప్మా డ్వాక్రా మహిళలకు అందిస్తున్న ఈ అవకాశాన్ని డ్వాక్రా మహిళలు వినియోగించుకోవాలని, ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలైన ఆసుపత్రులు, రైల్వే స్టేషన్, బస్టాండ్‌ల వద్ద ఈ క్యాంటీన్ ఏర్పాటు చేసుకోవడానికి స్థలం కేటాయిస్తారని, ప్రభుత్వం అందించే ఈ టెంట్లను ఎక్కడికి కావాలంటే అక్కడకు తీసుకువెళ్లవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ పావని, ఆర్‌ఓ మురళి పాల్గొన్నారు.



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి తదితరులు

గంజాయి విక్రేతపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావుపేటకు చెందిన సుంకర వంశీకృష్ణ గంజాయి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడి చేశారు. వంశీకృష్ణను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 140 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టాంపులు, నాణేల సేకరణను అభిరుచిగా మలచుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: స్టాంపులు, నాణేల సేకరణను విద్యార్థులు అభిరుచిగా మలచుకోవాలని తపాలా శాఖ సూపరింటెండెంట్ యు.యలమందయ్య సూచించారు. జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేవీకే పబ్లిక్ స్కూల్లో బుధవారం జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా స్టాంపులు, నాణేల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న యలమందయ్య మాట్లాడుతూ స్టాంపుల సేకరణ అనేది కింగ్ ఆఫ్ హాబిట్ వంటిదని తెలిపారు. స్టాంపుల సేకరణతో విద్యార్థుల్లో విజ్ఞానం అభివృద్ధి చెందడంతో పాటు చరిత్ర, భౌగోళిక విషయాలు, వివిధ దేశాల గొప్పదనం తెలుస్తాయని తెలిపారు. ఏపీ ఫిలాటిలిక్ సొసైటీ కార్యదర్శి ఎం. ప్రసాద్ మాట్లాడుతూ తపాలాశాఖ ప్రజలకు అందిస్తున్న సేవల్ని విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. స్టాంపులు సేకరణ అనేది ఒక సృజనాత్మక కళ అని వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ స్టాంపుల సేకరణ విద్యార్థుల్ని కొత్త ప్రపంచంలోకి తీసుకువెళుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శనను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై. రధినీచౌదరి, ఏవో కె. వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.